క్లుప్తంగా

12లోగా దరఖాస్తు చేసుకోండి

మెరకముడిదాం: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ఆరో తరగతి, ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో ప్రవేశాల కోసం ఈ నెల 12 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎస్ఓ గౌష్యాబేగం శుక్రవారం తెలిపారు. విద్యార్థులు వారి ఆధార్‌కార్డుతో పాటు తల్లిదండ్రుల ఆధార్‌కార్డు నంబర్లు, ఫొటో, ఇతర వివరాలతో దగ్గరలోని మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మీసేవ కేంద్రాలు అందుబాటులో లేనివారు తమ పూర్తి వివరాలతో నేరుగా పాఠశాలలో సంప్రదిస్తే వాటిని తమ సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. పాఠశాలలో పూర్తిస్థాయిలో సిబ్బంది, వసతి సౌకర్యాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

ఏపీఈఈ యూనియన్‌లో ఆర్ఈసీఎస్ ఉద్యోగులు



ఏపీ విద్యుత్ ఉద్యోగుల యూనియన్‌లో సభ్యత్వాలు పొందుతున్న ఆర్ఈసీఎస్ ఉద్యోగులు

చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల యూనియన్(ఏపీఈఈ)లో గ్రామీణ విద్యుత్ సహకార సంఘం(ఆర్ఈసీఎస్) ఉద్యోగులు చేరారు. ఈ మేరకు ఏపీఈఈ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఈసీఎస్‌లో పనిచేస్తున్న 130 మంది ఉద్యోగులకు ఏపీ విద్యుత్ ఉద్యోగుల యూనియన్‌లో సభ్యత్వం కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఆర్ఈసీఎస్ ఉద్యోగులు తమ సంఘంలో సభ్యత్వం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో ఏపీ విద్యుత్ ఉద్యోగులతో పాటు ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు మేలు జరిగే విధంగా కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ ప్రాంతీయ అధ్యక్షుడు ఎస్.లక్ష్మణరావు, ఆర్ఈసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎ.సూర్యనారాయణ, ఉద్యోగులు, వీఈడబ్ల్యూలు, ఎనర్జీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎండ పెరగక ముందే పనులు ముగించాలి

బొండపల్లి: ఎండ తీవ్రత దృష్ట్యా అన్ని గ్రామాల్లో ఉపాధి పనులను ఉదయం 11 గంటల లోపు ముగించాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు సూచించారు. మండలంలోని గొల్లుపాలెంలో కెకె.రాజు చెరువులో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే పనులకు హాజరుకావాలని సూచించారు. ఉదయం 6 నుంచి 11 గంటల మధ్య పనులు చేపట్టాలని, పని ప్రదేశంలో నీడ, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందాం

దత్తిరాజేరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్‌సీపీ మండల యువజన అధ్యక్షుడు దత్తి చిరంజీవి అన్నారు. రామచంద్రాపురం, ఎస్.చింతలవలస గ్రామాల్లో యువజన సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని కోరారు. ఆయన ముఖ్యమంత్రి అయితే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ఐదేళ్లలో జరిగిన మంచిని ప్రతి ఒక్కరికీ వివరించి మే 13న జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు.

నేడు మండల సమావేశం

వేపాడ: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నిశ్చల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులతో పాటు మండలంలోని సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

93 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

బొండపల్లి: మండలంలో శుక్రవారం సాయంత్రం నాటికి 93 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ఎస్.హరిహరరావు తెలిపారు. మండలంలో మొత్తం 8,099 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా.. 7,490 మందికి పంపిణీ పూర్తి చేశామని చెప్పారు. మిగతా వారికి శనివారం అందించనున్నట్లు చెప్పారు.

వలంటీర్ల రాజీనామా

దత్తిరాజేరు: మండలంలోని వంగర, దత్తిరాజేరు గ్రామాలకు చెందిన ఆరుగురు వలంటీర్లు తమ విధుల నుంచి తప్పుకున్నట్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ చంద్రకుమారి శుక్రవారం తెలిపారు. దత్తిరాజేరు నుంచి నలుగురు, వంగర నుంచి ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేసినట్లు చెప్పారు. ఎన్నికలు కోడ్ అమలులో ఉన్నందున వలంటీర్లు ఎవరైనా ఎన్నికల ప్రచారం, విధుల్లో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పల్లెల్లో ప్రగతి బాటలు

గ్రామాభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. ఐదేళ్లలో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ప్రాధాన్యత క్రమంలో కల్పించింది. రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి కోట్లాది రూపాయలు మంజూరు చేసింది. గతంలో అధ్వానంగా ఉన్న గ్రామీణ రహదార్లు నేడు అద్భుతంగా మారాయి.



చీపురుపల్లి రూరల్: గ్రామంలోని విజయకాలనీకి నిర్మించిన సీసీరోడ్డు



చీపురుపల్లి రూరల్: గ్రామంలోని శ్మశానవాటికకు రూ.15 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డు

చీపురుపల్లి రూరల్(గరివిడి): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గరివిడి మండలం అర్తమూరు గ్రామంలో ఈ ఐదేళ్లలో సుమారు రూ.50 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. స్థానిక సర్పంచ్ పొన్నాడ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలోని పలు వీధుల్లో సీసీరోడ్లు నిర్మించారు. గ్రామంలోని విజయకాలనీ ప్రాంతంలో సుమారు రూ.14 లక్షలతో రోడ్డు సౌకర్యం కల్పించారు. గ్రామంలోని శ్మశానవాటికకు సరైన రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతుండటంతో రూ.15 లక్షలతో కొంతదూరం వరకు సీసీరోడ్డు నిర్మించారు. మిగిలిన దూరానికి రూ.1.5 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు. అలాగే రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కారి చెరువు, మర్రిబంద చెరువు వరకు సుమారు రూ.4 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు. వీటితో పాటు డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతులు కల్పించడంతో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభించింది.

గుర్ల: మండలంలోని పెద్దబంటుపల్లి రెల్లివీధిలో రూ.2 లక్షలతో సీసీరోడ్డు, కాలువలు నిర్మించారు. ఈ వీధిలో గతంలో మట్టిరోడ్డు ఉండేది. దీంతో ఇళ్లలోని వాడుకనీరు వీధిలో చేరి నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. వర్షకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. స్థానిక ప్రజాప్రతినిధుల వినతి మేరకు అధికారులు వెంటనే స్పందించి సీసీరోడ్డు, కాలువలు నిర్మించారు.



గుర్ల: నూతనంగా నిర్మించిన పెనుబర్తి ప్రధాన రహదారి

గుర్ల: మండలంలోని పెనుబర్తి గ్రామంలో ప్రధాన రహదారి పూర్తిగా పాడవ్వడంతో రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. వీధికాలువలు లేకపోవడంతో మురుగునీరు, వర్షపునీరు రోడ్డు మధ్యలో నిలిపోయేది. రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.25 లక్షలు నిధులు మంజూరు చేయడంతో యుద్ధప్రాతిపదికన బీటీరోడ్డు, కాలువలు నిర్మించారు. దీంతో మురుగు సమస్యకు మోక్షం లభించిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గుర్ల: పెద్దబంటుపల్లి రెల్లివీధిలో వేసిన సీసీరోడ్డు

ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రతీ గడపకు తెలియజేయండి



గరుడుబిల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

- ఎంపీపీ చల్లా చలంనాయుడు

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. మండలంలోని గరుడుబిల్లి, గొట్లాం గ్రామాల్లో శుక్రవారం పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా బొత్స అప్పలనరసయ్య, ఎంపీ అభ్యర్థిగా బెల్లాన చంద్రశేఖర్ మరోసారి పోటీ చేస్తున్నారని, వారిని భారీ మెజార్టీతో గెలిపించుకోవడం ద్వారా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఈ విషయాలను ప్రతీ గడపకు వెళ్లి వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీకి మద్దతివ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాపాక సూర్యప్రకాశరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, మండల కన్వీనర్ పల్లి రఘు, పార్టీ జిల్లా నాయకులు మీసాల తులసీరాం, లెంక రమణ, మండల రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజం



చినకాదలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

దత్తిరాజేరు: ఎన్నికలు వచ్చినప్పుడు తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజమని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ధ్వజమెత్తారు. మండలంలోని చినకాద, కన్నాం గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు మురార్జీ, మురళి, సన్యాసిరావు, తదితరులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ వ్యవస్థలతో సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరవేస్తున్నామని, ప్రతీ నెల ఒకటో తేదీనే పింఛన్లు అందజేస్తున్నామని అన్నారు. దీన్ని చూసి చంద్రబాబు ఓర్వలేక తన బినామీ సంస్థతో వలంటీర్లపై ఈసీకి ఫిర్యాదు చేసి వారి సేవలను నిలుపుదల చేయించారని మండిపడ్డారు. వచ్చే వారంలో ముఖ్యమంత్రి బస్సు యాత్ర పెదమానాపురం మీదుగా వెళ్తుందని, అక్కడకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి ఆయనకు మద్దతుగా నిలవాలని కోరారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

గంట్యాడ: కొర్లాం సర్పంచ్ చప్ప వెంకటరమణమ్మ గురువారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శుక్రవారం కొర్లాం వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటరమణమ్మ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు.



వెంకటరమణమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

పత్రాలు తప్పనిసరి

గజపతినగరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు తరలింపుపై నిఘా పెట్టినట్లు సీఐ ఎస్.వి.ప్రభాకరరావు తెలిపారు. గజపతినగరంలో శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం, నగదు తరలిస్తూ పట్టుబడితే వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్సై యు.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: వాహనాల్లో తరలించే ప్రతి వస్తువుతో పాటు పరిమితికి మించి నగదుకు తప్పనిసరిగా రసీదులు ఉండాలని, లేకుంటే సీజ్ చేయడం జరుగుతుందని ఎస్సై కె.లక్ష్మణరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. రూ.50 వేలకు మించి నగదు, పెద్ద మొత్తంలో సామగ్రిని తీసుకొని వెళ్లేవారు తగిన ఆధారాలను వెంట ఉంచుకోవాలని సూచించారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ ప్రభాకరరావు

మజ్జిగౌరమ్మ పసిడి కలశం పునఃప్రతిష్ట

మెరకముడిదాం: మండలంలోని భైరిపురం గ్రామంలో వెలసిన మజ్జిగౌరమ్మ ఆలయంలో పసిడి కలశం పునఃప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త కెంగువ ధనంజయ దంపతులు, గ్రామపెద్దలు, భక్తుల ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 2 వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు.

వైభవంగా ప్రాణ ప్రతిష్ట

బొండపల్లి: మండలంలోని అంబటివలసలో సంతోషిమాత ఆలయం ఆవరణంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రాణప్రతిష్టా కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు గూమ్మా నర్సింహమూర్తి, నాగ భాస్కర సంతోష్‌కుమార్ శర్మ తమ సొంత ఖర్చులతో విగ్రహం ఏర్పాటు చేశారు. వేద పండితుల సమక్షంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేశారు. అనంతరం ఆలయం ఆవరణంలో అన్న సమారాధన కార్యక్రమం చేపట్టగా.. వేలాది మంది భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు.

జగనన్న ప్రభుత్వానికి పేదలే అండ

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు
- ఖాసాపేటలో ఎన్నికల ప్రచారం



లక్కవరపుకోట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, తదితరులు

లక్కవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరు చెపితే సంక్షేమం, అభివృద్ధే గుర్తుకొస్తాయని.., పేదలు, బడుగు బలహీనులే ఆయనకు అండగా ఉంటారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఖాసాపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ.. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. ఇదే గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యేతో పాటు ఆమె మామ అప్పలనాయుడు 9 పర్యాయాలు ఎమ్మెల్యేలుగా పని చేశారు. గ్రామంలో కనీసం మౌలిక వసతులు కల్పించలేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సుమారు రూ.3 కోట్లతో గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ భవనాలు, సచివాలయాలను నిర్మించి అభివృద్ధి చేశామన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని, ఎమ్మెల్యేగా తనను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డీసీబీసీ చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడులు, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ఎం.శ్రీనురాజు, కొత్తవలస మండల వైస్ ఎంపీపీ శ్రీను, జామి మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె రవికుమార్, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ యద్ల కిశోర్‌కుమార్, పార్టీ నాయకులు కోళ్ల కృష్ణ, సీహెచ్.మాధవరావు, కొటాన ఈశ్వరరావు, పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మీ సంక్షేమం కోరేవారికి ఓటేయండి

శృంగవరపుకోట: మీ సంక్షేమం కోరుతున్న పార్టీకి ఓటు వేయండి. మీ పింఛన్లు మీ ఇంటికి రాకుండా సైంధవుడిలా అడ్డు పడుతున్న చంద్రబాబును నమ్ముకుంటే మళ్లీ మనం అధోగతి పాలవుతామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు డా.కుంభా రవిబాబు, శోభా హైమావతి, జీసీసీ చైర్మన్ డా.శోభా స్వాతీరాణి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణతో కలిసి శుక్రవారం సాయంత్రం ఎస్.కోట పట్టణంలోని శ్రీనివాస కాలనీలో గడపగడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ ఫలాలు అందరికీ అందాలంటే మళ్లీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కడుబండి శ్రీనివాసరావును ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీని ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, పట్టణ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, ఏఎంసీ డైరెక్టర్ డి.పార్వతి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్.కోట: శ్రీనివాసకాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు రవిబాబు, హైమావతి, తదితరులు

వైఎస్సార్‌సీపీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు

- ఎమ్మెల్సీ రవిబాబు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి



ఎన్నికల ప్రచార పత్రాలను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శృంగవరపుకోట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని, జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావటం తథ్యమని మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ డా.కుంబా రవిబాబు ఉద్ఘాటించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నేతృత్వంలో శుక్రవారం సాయంత్రి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడ్డుకునేందుకు చంద్రబాబు అండ్ కో వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసి సంక్షేమాన్ని పేదలకు అందకుండా చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు 14 ఏళ్లు సీఎంగా ఉండి చేయలేని అభివృద్ధిని, సంక్షేమాన్ని సీఎం జగన్ ఐదేళ్లలో అందించారని అన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో చంద్రబాబు ఏనాడూ ఒంటరిగా పోటీ చేయలేదని, ఎవరో ఒకరితో పొత్తులు లేకుండా గెలవలేడని ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే హైమావతి మాట్లాడుతూ.. ప్రతి నెల ఒకటో తేదీ ఉదయం 6 గంటలకు ఇంటికందే పింఛన్ కోసం నేడు చంద్రబాబు పుణ్యమా అని రోజంతా ఎండలో నిరీక్షించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జగన్ లాంటి ప్రజానాయకుడిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకమై, ఈసీని అడ్డం పెట్టుకుంటూన్నారన్నారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ శోభా స్వాతిరాణి, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పి.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



కొత్తవలస: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాగ్దేవి కళాశాల సిబ్బంది



గజపతినగరం: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వసతిగృహ సంక్షేమాధికారి, విద్యార్థులు



వేపాడ: వల్లంపూడిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



చీపురుపల్లి: జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

కొత్తవలస: భారత ఉప ప్రధానిగా, రక్షణ శాఖ మంత్రిగా దేశానికి బాబూ జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమైనవని వాగ్దేవి కళాశాల అధినేత కె.మహేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం వాగ్దేవి కళాశాల ఆవరణలో జగ్జీవన్‌రామ్ జయంతీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ప్రవీణ్‌కుమార్, కుమార్‌బాబు, ఎ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: మండలం కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో వసతి గృహ సంక్షేమాధికారి ఎం.గౌరి ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా దేశానికి ఆయన అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు.

వేపాడ: మండలంలో వల్లంపూడిలో మండల దళిత మహాసభ అధ్యక్షుడు కొమనాపల్లి రాము ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. బల్లంకి, నీలకంఠరాజపురం గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు.

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారంలో ఉన్న ప్రజా గ్రంథాలయంలో ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పాఠకులతో కలిసి అసోసియేషన్ ప్రతినిధులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, ఉపాధ్యాయుడు డోల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

కొత్తవలస: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎం.త్రినాథరావును నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. కొత్తవలస పార్టీ కార్యాలయంలో శుక్రవారం త్రినాథరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ తనపై నమ్మకంలో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు.

జామి: బీజేపీ మండల అధ్యక్షులుగా జామి గ్రామానికి చెందిన రాయవరపు ఆదిలక్ష్మీ నియమితులయ్యారు. ఇదివరకు ఆ స్థానంలో ఉన్న వి.భాస్కరరావును పార్టీ అధిష్టానం తప్పించి ఆదిలక్ష్మిని నియమించింది.

నేడు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

జామి: మండలంలో లొట్లపల్లి గ్రామంలో శనివారం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామానికి చెందిన యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. నూకాలమ్మ తీర్థమహోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 4గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.12 వేలు, రూ.7 వేలు, రూ.4 వేలు చొప్పున నగదు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఎంట్రీ ఫీజ్ రూ.200 చెల్లించి పోటీల్లో పాల్గొనాలని కోరారు.